మహబూబాబాద్ రూరల్ : రేగడితండాలో అధికారులతో వాగ్వాదం

గార్లలో అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజలు, నాయకులు

డోర్నకల్ : మన్నెగూడెంలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

కురవి: లింగ్యాతండా(బి)లో అధికారులను నిలదీస్తున్న మహిళ

చివరి రోజూ అదే లొల్లి

- రచ్చరచ్చగా ప్రజాపాలన గ్రామ సభలు
- జాబితాల్లో అనర్హులకు చోటుపై ఆందోళనలు
- ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలని ఆగ్రహం

ఇనుగుర్తి : అధికారులను నిలదీస్తున్న గిరిజన మహిళ

బయ్యారం : ప్రజలను అడ్డుకుంటున్న పోలీసులు

మహబూబాబాద్ రూరల్, జనవరి 24 : ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపిక కోసం శుక్రవారం నిర్వహించిన చివరి రోజు గ్రామ సభలు రసాభాసగా మారాయి. అధికారులు జాబితాను చదివి వినిపించగానే అనర్హులకు చోటు కల్పించారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులకు న్యాయం చేయకుంటే ఊరుకునేది లేదని తెగేసి చెప్పారు. శుక్రవారం మహబూబాబాద్ పట్టణంలో 8వ, 20, 27, 29,31, 32వ వార్డులలో గ్రామ సభలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పిన వారికే ప్రభుత్వ పథకాలకు ఎంపిక చేశారని ప్రజలు అధికారులతో ఘర్షణకు దిగారు. అనర్హులను తొలగించి అర్హుల జాబితా సిద్ధం చేయాలని ప్రజలు అధికారులను కోరారు. మండలంలోని రేగడితండా, దామ్యతండా, మాధవాపురం, జర్పులతండా, కొమ్ముగూడెం, వీఎస్ లక్ష్మీపురం, హజారియాతండాల్లో గ్రామసభలు నిర్వహించారు. రేగడి తండా, దామ్యతండాలో జాబితా సరిగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రీ సర్వే చేసి అర్హులను ఎంపిక చేయాలన్నారు.

గ్రామ సభలో గందరగోళం

గార్ల : గార్ల గ్రామ సభ గందరగోళంగా మారింది. కాంగ్రెస్ నాయకుల కుటుంబాలకు ప్రభుత్వం పథకాలు లబ్ధి జరిగే విధంగా లిస్టులో పేర్లు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పినిరెడ్డిగూడెం, గోపాలపురం గ్రామ సభలో రసాభాసగా మారింది.

డోర్నకల్‌లో..

డోర్నకల్ : మండలంలోని ముల్కలపల్లి, బంజర, ఉయ్యాలవాడ, గుర్రాల కుంటతండాలో, సీరోలు మండలం మన్నెగూడెం, మోదుగుగడ్డ తండాల్లో గ్రామసభలు జరిగాయి. మన్నెగూడెంలో ఉపాధి హామీ పనిచేయని వారి పేర్లు ఉండటంతో గంటసేపు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇది అర్హుల జాబితా కాదని, కాంగ్రెస్ నాయకుల జాబితా అంటే మండిపడ్డారు.

కురవిలో..

కురవి : మండలంలోని పెద్దతండా, లింగ్యాతండా(బి), కందికొండ, బంగ్యాతండా, తట్టుపల్లి, తిర్మలాపురం, మొగిలిచర్ల, బలపాల, సూదనపల్లి, బీబీనాయక్‌తండా, సీరోలు మండలం ఉప్పరిగూడెం, గోపతండా, పెద్దలాలుతండాల్లో గ్రామసభలు జరిగాయి. అర్హులకు చోటుదక్కకపోవడంతో ప్రజలు అధికారులను నిలదీసారు. డబ్బు, పరపతి ఉన్నవారికే చోటు దక్కిందని, మళ్లీ సర్వే చేసినా ఫలితం ఉండదని ప్రజలు బాహాటంగానే విమర్శించారు. బలపాల లింగ్యాతండా, కందికొండ, తట్టుపల్లి తదితర గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు పరసర్పం వాదనలకు దిగారు. లింగ్యాతండాలో మాజీ సర్పంచ్ రాంలాల్, కాంగ్రెస్‌నాయకుడు హరిలాల్‌ల మధ్య పరస్పర వాగ్వివాదం చోటుచేసుకోవడంతో తహసీల్దార్ సునీల్‌రెడ్డి జోక్యం చేసుకుని సముదాయించారు. కందికొండలో కాంగ్రెస్ నాయకులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య గొడవ జరిగింది. తట్టుపల్లిలో యాసంగి నాట్లు ముగిసినప్పటికీ రైతు భరోసా ఇవ్వలేదని ప్రభాకర్ అనే వ్యక్తి అధికారులను ప్రశ్నించారు.

ఇనుగుర్తిలో..

ఇనుగుర్తి : మండలంలోని లాలుతండా, రాముతండా జీపీల్లోని గిరిజనులు అధికారులను నిలదీశారు. లాలుతండా మాజీ ఉపసర్పంచ్ గుగులోత్ నరేందర్ జాబితాల్లో వ్యవసాయ భూములున్న ధనికుల పేర్లు ఉండి నిరుపేదల పేర్లు లేకపోవడంతో అధికారులను ప్రశ్నించాడు. ఆయనను ఏఎస్సై అడ్డుకోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

రెండు వర్గాల మధ్య తోపులాట..

మరిపెడ : మండలంలోని రేఖ్య తండా గ్రామసభలో రెండు వర్గాల మధ్య తోపులాటకు దారితీసింది. అర్హుల పేర్లు లేకపోవడంతో అధికారులను నిలదీస్తున్న సమయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గాలు తోసుకోవడంతో ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. పోలీసులు శాంతింప చేయడంతో గ్రామ సభను సాగించారు. నీలికుర్తి, ఉల్లేపల్లి, రూప్‌సింగ్‌తండా, ధరావత్ తండా, రాంపురంలో అధికారులను నిలదీసి నిరసన వ్యక్తం చేశారు.

నర్సింహులపేటలో..

నర్సింహులపేట : గ్రామ సభలు 9 గంటలకు ప్రారంభ కావాల్సి ఉండగా కొమ్ములవంచ గ్రామంలో 10:06 నిమిషాలకు తహసీల్దార్ నాగరాజు వచ్చి 10:20 గ్రామసభ ప్రారంభించారు. 10:22కు ఏఈవో, 10:35 గ్రామ ప్రత్యేకాధికారి ఎంపీడీవో వచ్చారు. అప్పటికే పంచాయతీ కార్యదర్శి అర్హుల లిస్టు చదవడం ప్రారంభించారు. మండలంలోని కొమ్ములవంచ, రూప్లాతండా గోల్‌బొడ్కతండా, వస్రంతండా జీపీపరిధిలో గ్రామసభలు నిర్వహించారు. గోల్ బోడ్కతండాలో పాఠశాల అవరణలో నిర్వహించడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. అధికారులు 12 గంటలకే వెళ్లిపోయారని దరఖాస్తులు తీసుకునే వారు లేరని వాగ్వాదానికి దిగారు. పోలీసులు జోక్యం చేసుకుని కూర్చోబెట్టారు. అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని తొర్రూరు ఆర్డీవో గణేశ్ సూచించారు.

చిన్నగూడూరులో..

చిన్నగూడూరు : చిన్నగూడూరు, జయ్యారం గ్రామ పంచాయతిల్లో శుక్రవారం గ్రామసభలు జరిగాయి. అనర్హుల పేర్లు జాబితాల్లో ఉండడంతో అధికారులను మహిళలు నిలదీశారు. మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ తనకు గుంట భూమి లేదని, తన పేరు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో లేదంటూ కన్నీటి పర్యాంతమైంది. కార్యక్రమాల్లో ఎంపీడీవో రామారావు, తహసీల్దార్ మహబూబ్‌అలీ, ప్రత్యేకాధికారి బీమ్లానాయక్, ఎంపీవో రజినీ, హెచ్‌ఎం ఉషశ్రీ, కార్యదర్శులు సోమన్న, దాసు పాల్గొన్నారు.

బయ్యారంలో..

బయ్యారం : మండలంలో చివరి రోజు బయ్యారం, కొత్తపేట, నర్సాతండా, గురిమళ్ళ, కొత్తపేట గ్రామాల్లో ప్రజా పాలన గ్రామ సభలు నిర్వహించగా అధికారుల నిలదీతతో గందరగోళం నెలకొంది. బయ్యారంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా విషయంలో దుమారం తలెత్తింది. సాగు యోగ్యంగా లేని భూములతోపాటు రియల్ ఎస్టేట్ ప్లాట్లుగా చేసి విక్రయించిన భూములు ఉన్నాయని వాటికి రైతు భరోసా నిలిపివేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాల్లో అర్హుల పేర్లు లేకపోవటంతో పైసలు ఇచ్చిన వారి పేర్లు జాబితాలో పెట్టారని ఆరోపించారు. ఈ క్రమంలో అధికారులు, ప్రజలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి ప్రజలకు సర్దిచెప్పి స్టేజీ వద్దనుంచి పంపించారు. ఆత్మీయ భరోసా జాబితాను రద్దు చేయాలని ప్రజలు పట్టుపట్టడంతో తహసీల్దార్ విజయ తీర్మానం చేస్తామని అంగీకరించారు. కొత్తపేటలో ఇందిరమ్మ ఇళ్ల అర్హుల్లో పేర్లు లేక పోవటంతో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులే అసంతృప్తి వ్యక్త చేస్తు అధికారులను నిలదీశారు. ఎంపీడీవో విజయలక్ష్మి పాలొన్నారు.

పెద్దవంగరలో..

పెద్దవంగర : మండలంలోని బీసీతండా, వంపుతండా, రామచంద్రుతండా, కొరిపల్లి, కాన్వాయిగూడెం, జయరాం తండా, పడమటి తండాల్లో గ్రామసభలు నిర్వహించారు. అర్హుల పేర్లు రాలేదని ప్రజలు మండిపడ్డారు. కొరిపల్లిలో అధికారులపై కాంగ్రెస్ నాయకులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య పరస్పర వాగ్వాదం జరిగింది. కాన్వాయిగూడెంలో గ్రామసభ ప్రారంభం కాకముందే తీర్మానాలపై ప్రజలతో సంతకాలు చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుమాధవ్, తహసీల్దార్ మహేందర్, ఏవో స్వామి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

దంతాలపల్లిలో..

దంతాలపల్లి : మండలంలోని బీరిశెట్టిగూడెం, వాల్యతండా, రామనుజపురం, దొనకొండ, వేములపల్లి, రావవరం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. రామనుజపురం, వేములపల్లి గ్రామాల్లో డోర్నకల్ ఎమ్మెల్యే రంచంద్రునాయక్ పాల్గొని పథకాలపై వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్, ఎంపీడీవో వివేక్‌రాం, ఏవో వాహిని, అధికారులు పాల్గొన్నారు.

కేసముద్రంలో..

కేసముద్రం : అర్హులందరికీ 6 గ్యారెంటీలను అమలు చేస్తామని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మండలంలోని బేరువాడ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. గ్రామసభలలో దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు మాత్రమే చదువుతున్నామని, దరఖాస్తు చేసుకోని వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్లు అల్లం నాగేశ్వరరావు, అంబటి మహేందర్‌రెడ్డి, ఎంపీడీవో క్రాంతి తదితరులు ఉన్నారు.

దంతాలపల్లి : రామనుజపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

పెద్దవంగర : కొరిపల్లిలో అధికారులతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం

చిన్నగూడూరు : అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

మరిపెడ : రెండు వర్గాల మధ్య తోపులాట

నర్సింహులపేట : గొడవ చేస్తున్న మహిళ

వేసవిలో కూరగాయల సాగు లాభదాయకం

ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ జిల్లా అధికారి మరియన్న

నెల్లికుదురు, జనవరి 24 : వేసవిలో కూరగాయల సాగు రైతులకు లాభదాయకమని ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖ జిల్లా అధికారి మరియన్న అన్నారు. మండలంలోని రత్తిరాంతండా, బడితండాలో శుక్రవారం కూరగాయల పంటల సాగును క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో 2537ఎకరాల్లో రైతులు కూరగాయలు చేస్తున్నారని, ప్రస్తుత జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో వంగ, గోరు చిక్కుడు, బెండ, దోస, సోరకాయ, ఆకుకూరలు, కొత్తిమీర, పుదీనా తదితర పంటలు రైతులకు ఎంతగానో లాభదాయకంగా ఉంటాయని తెలిపారు. ఎత్తైన మడులు, పందిళ్లు, ట్రెలిస్ వంటి ఆధునిక పద్ధతుల్లో సాగు చేస్తే నాణ్యమైన దిగుబడిని పొందవచ్చని రైతులకు సూచించారు. రైతులు, అధికారులు పాల్గొన్నారు.

28న వాహనాల వేలం

తొర్రూరు, జనవరి 24 : ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 28న ఎక్సైజ్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఏఈఎస్), తొర్రూరు స్టేషన్ ఇన్‌చార్జి ప్రవీణ్ తెలిపారు. తొర్రూరు ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 28న ఉదయం 8గంటలకు నిర్వహించే ఈ వేలంలో పాల్గొనదలచిన వారు 50 శాతం డిపాజిట్ చెల్లించి నమోదు చేసుకోవాల్సిందిగా సూచించారు. తొర్రూరు ఎక్సైజ్ ఎస్సైలు రవళీరెడ్డి, ఎన్ శంకర్, సిబ్బంది శ్రీనివాస్, సత్యప్రసాద్, గౌస్ పాషా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

మరిపెడ, జనవరి 24: ఇటీవల ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న వృద్ధురాలు శుక్రవారం మృతి చెందిన ఘటన మండలంలోని వీరారం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై సతీశ్ తెలిపిన ప్రకారం.. కొండబోయిన పుల్లమ్మ (65) గురువారం అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం మహబూబాబాద్‌లో ఆసుపత్రికి వెళ్లింది. ఆటోలో ఇంటికి వస్తున్న క్రమంలో పురుషోత్తమాయగూడెం గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం బలంగా ఆటోను వెనక నుంచి ఢీ కొనడంతో ఆటో బోల్తా పడి అందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయలయ్యాయి. చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పుల్లమ్మ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

చెరువులో మునిగి మరొకరు..

గార్ల, జనవరి 24 : చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం పుల్లూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై రియాజ్ పాసా తెలిపిన ప్రకారం.. కారేపల్లి మండలం చీమ్లా తండాకు చెందిన గుగులోత్ రాములు(65) పుల్లూరు చెరువులో చేపల వేటకు వచ్చి నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడి కుమారుడు ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

డోర్నకల్, జనవరి 24 : రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం పాన్నేకల్ రోడ్డులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... డోర్నకల్ మండలం దుబ్బతండాకు చెందిన ఇస్లావత్ భాషా, భార్య సుజాత ద్విచక్ర వాహనంపై తమ కుమారుడు హరీశ్‌ను ఇల్లందు మండలం మూల పోచారం హాస్టల్ దించారు. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో పాన్నేకల్ రోడ్డులో టిప్పర్ ఢీకొట్టింది. దీంతో భారాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108వాహనంలో ఖమ్మం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

ఒకరికి గాయాలు..

కురవి, జనవరి 24 : రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన పొదిళ్ల తేజ అనే యువకుడు ద్విచక్రవాహనంపై కురవికి వస్తున్నాడు. ఈ క్రమంలో నల్లెల్ల స్టేజీ సమీపంలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన కిందపడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు 108 సహాయంతో మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

చిన్నగూడూరు, జనవరి 24 : మండలంలోని మన్నెగూడెం గ్రామానికి చెందిన గుడిసె వెంకటేశం కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందాడు. వెంకటేశం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ సహకారంతో బాధితుడికి రూ.60వేల చెక్కు మంజూరైంది. శుక్రవారం స్థానిక బీఆర్ఎస్ నాయకులు బొమ్మకంటి వెంకట్‌గౌడ్, సోమన్న బాధితుడికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సైదులు, వెంకటేశ్, రామచంద్రయ్య, వెంకన్న, నర్సయ్య, శ్రీనివాస్, శ్రీను ఉన్నారు.

నేడు ఇసుక వేలం

చిన్నగూడూరు, జనవరి 24 : మండలంలోని కొమ్ములవంచ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను ఈ నెల 25వేలం వేయనున్నట్లు శుక్రవారం తహసీల్దార్ నాగరాజు తెలిపారు. ఈ నెల 10న సుమారు 10ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను సీజ్ చేశామని తెలిపారు. సీజ్ చేసిన ఇసుకను ఈ నెల 25న ఉదయం 11గంటలకు వేలం వేస్తామని, ఆసక్తి కలవారు వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు సీపీఐ శతాబ్ది ఉత్సవాల సభ

మహబూబాబాద్ రూరల్, జనవరి 24 : నేడు పట్టణ కేంద్రంలో సీపీఐ శతాబ్ది ఉత్సవాల బహిరంగ సభను నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ్‌సారథి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటగా పట్టణంలో ముత్యాలమ్మ గుడి సెంటర్ నుంచి పార్టీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం మూడు కోట్ల సెంటర్‌లో సభ ఉంటుందన్నారు. ఈ శతాబ్ది ఉత్సవాలకు ఎమ్మెల్యేలు, సీపీఐ రాష్ట్ర నాయకులు హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో అజయ్‌సారథి, పెరుగు కుమార్, వెంకన్న, సాంబలక్ష్మి, పాండురంగారావు, సందీప్, రమేశ్ పాల్గొన్నారు.

'పాలకమండలిని అవమానపరిచిన కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి'

మహబూబాబాద్ రూరల్, జనవరి 24 : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ పాలకవర్గం మొత్తాన్ని అవమానపరిచాడని 13వ వార్డు కౌన్సిలర్ దండేబోయిన బుజ్జి వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి వార్డులకు నిధులు కేటాయించాలని పాలకవర్గం తీర్మానం చేసినా నిధులు కేటాయించలేదన్నారు. మున్సిపల్ సమావేశం నడుస్తుండగానే కమిషనర్ బహిష్కరించి వెళ్లిపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. పాలక వర్గం విడ్కోల్‌కు నిధులు కేటాయించ కుండా అవమానపరిచి వెళ్లిన కమిషనర్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

షూటింగ్ బాల్ పోటీలకు నరేశ్

కురవి, జనవరి 24 : కురవి మండలం నల్లెల్ల శివారు టేకులతండాకు చెందిన బానోత్ నరేశ్ ఒడిసాలో జరిగిన 43వ సీనియర్ నేషనల్ షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొన్నాడు. నల్గొండలో డిసెంబర్ 23,24,25 జరిగిన సీనియర్ షూటింగ్ బాల్ స్టేట్ మీట్ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో ఒడిసాలో జరిగిన పోటీల్లో పాల్గొని క్వార్టర్ స్థాయి వరకు క్వాలీఫై అయ్యాడు. నరేష్ షూటింగ్ బాల్‌తోపాటు రగ్బీ ఆటలో కూడా ప్రావీణ్యం సాధించాడు. తన గెలుపులో తల్లిదండ్రులు, మేనమామ మహేందర్ సహకారంతోనే సాధ్యమైందని నరేశ్ తెలిపారు. నరేశ్‌ను మండల ప్రజలు, క్రీడాకారులు అభినందించారు.

డప్పు కళాకారుల మండల కమిటీ ఎన్నిక

దంతాలపల్లి, జనవరి 24 : డప్పు కళాకారుల మండల కమిటీని శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ మండల అధ్యక్షుడిగా ధర్మారపు సందీప్, ఉపాధ్యక్షుడిగా బొల్లం రాజును ఎన్నుకున్నారు.

పాఠశాలకు ఫ్యాన్లు అందజేత

కురవి(సీరోలు), జనవరి 24 : సీరోలు మండలం కాంపల్లి ఉన్నత పాఠశాలకు కిసాన్ పరివార్ సంస్థ సీఈవో డాక్టర్ వివేక్ 15సీలింగ్ ఫ్యాన్లను శుక్రవారం అందచేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీలత, ఉపాధ్యాయులు, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
jobs Apply Now!
★MEDICAL SHOP STAFF (Experienced.), System Operators (Exp.), Hospital Administrators (Exp.), LAB-Technicians (Exp.), OT-Technicians (Exp.) Cont: Guardian Hospital, Wgl. 12 to 2 PM.
NTW-467

CHANGE OF NAME
I, MOSALI SURESH REDDY (New Name), R/o H.No. 1-7-1288, Advocates Colony, Road No.4, Hanamkonda Mdl, Hanumakonda District-506 001, T.G State, India, Have Changed my name from MOSALI SURESH (OLD NAME), To MOSALI SURESH REDDY (New Name) for all purposes.

★త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. Ph: 8520980099 / 8520874499.
NT-327009-All

PLOTS FOR SALE
★Hyd. హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహెడ శ్రీమిత్ర, బాటసింగారం, తూప్రాన్‌పేట్, పోచంపల్లి శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును. No Brokers. 9553973999 / 6303049720.
NT-326614

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను సాధించాలి

ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్ రూరల్, జనవరి 24 : బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను సాధించాలని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని కురవి రోడ్‌లో ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్‌తో కలిసి సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్సీ రవీందర్‌రావు మాట్లాడుతూ త్వరగా విగ్రహం ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలన్నారు. తన సహాయ సహకారాలు ఎల్లప్పుడు అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు జేరిపోతుల వెంకన్న, రాజేందర్, ముత్యం వెంకన్న వెంకటేశ్వర్లు, ఎడ్ల వేణుమాదవ్,వెంకన్న,రాములు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

నర్సింహులపేట, జనవరి 24 : నూతనంగా వ్యవసాయ భూమి పట్టా చేసుకున్న రైతులు రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏవో వినయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. జనవరి 1వరకు కొత్తగా వచ్చిన పట్టాదారులు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్స్‌ను దరఖాస్తు ఫాంతో క్లస్టర్ ఏఈవోకు అందించాలని సూచించారు.

ఫ్లెక్సీతో యువకుడి నిరసన

ప్రాణభయం ఉంది కాపాడాలని వేడుకోలు

మరిపెడ, జనవరి 24 : ఫ్లెక్సీతో యువకుడు వినూత్నంగా నిరసన తెలిపిన మరిపెడలో శుక్రవారం చోటుచేసుకుంది. యువకుడు మాట్లాడుతూ తన చేనుకు పోకుండా రోడ్డుపై అడ్డంగా గోడ నిర్మించారని, ఇదే విషయాన్ని వారిని అడగటంతో తన సైకిల్‌ను ట్రాక్టర్‌తో తొక్కించారని తెలిపారు. తనకు ఏడుగురితో ప్రాణభయం ఉందని ఫ్లెక్సీలో పేర్లు నమోదు చేసి నిరసన తెలిపాడు. అధికారులు స్పందించి తనకు వారి నుంచి రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు.

పీహెచ్‌సీలో అస్తవ్యస్తంగా రికార్డుల నిర్వహణ

- నిర్లక్ష్య ధోరణిగా వ్యవహరిస్తున్న ఫార్మసిస్టు
- డీఎంహెచ్‌వో పర్యవేక్షణ శూన్యం
- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు
- నెల్లికుదురు పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ

ఓపీ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

నెల్లికుదురు, జనవరి 25 : 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాల్సిన నెల్లికుదురు పీహెచ్‌సీలో రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదని, ఫార్మసిస్టు విధి నిర్వహణలో నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నాడని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలకేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందిస్తున్న వైద్య సేవలను మెడికల్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను పరిశీలించారు. వివరాలు పూర్తిస్థాయిలో లేకపవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వారం రోజుల్లో వైద్య సేవలు పొందినవారిలో ఒక్కరితో మాట్లాడడానికి మీ వద్ద ఉన్న ఆధారాలు చూపాలని కోరగా మెడికల్ ఆఫీసర్ నీళ్లునమిలారు. ఆస్పత్రికి వచ్చిన మందులెన్ని...? ప్రజలకు ఇచ్చిన మందులెన్ని...? నిల్వ ఉన్న మందులెన్ని..? ఆ వివరాలకు ఫార్మసిస్టు జవాబు చెప్పకపోగా సంబందిత రికార్డును చూపించలేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. పంతులుతండాకు చెందిన భూక్యా జోగ్య గతంలోలా వైద్య సేవలు అందడం లేదని, జిల్లా ఏరియా ఆస్పత్రికి వెళ్తే అక్కడ కూడా ఎవరూ పట్టించుకోవడంలేదని మీరైనా వారితో మాట్లాడాలి సారు అని ఎమ్మెల్సీని వేడుకున్నారు. వెంటనే ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫోన్ చేసి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్యశాఖ అస్తవ్యస్తంగా ఉండదన్నారు. డీఎంహెచ్‌వో ఎక్కడ పర్యవేక్షణ చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. నెల్లికుదురు ఆస్పత్రిలో డీఎంహెచ్‌వో తనిఖీ చేసినట్లు సంతకం చేశారని, ఇప్పుడు ఇక్కడ చూస్తే ఒక్క రికార్డు కూడా సక్రమంగా లేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందే విధంగా చూడాలని రవీందర్‌రావు కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, నాయకులు పరపాటి వెంకట్‌రెడ్డి, యాసం రమేశ్, ఆదిరెడ్డి, నల్లాని నవీన్‌రావు, వీరగాని మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి 50 క్వింటాళ్ల బియ్యం

మహబూబాబాద్ రూరల్, జనవరి 24 : పట్టణంలోని వేల్పుల సత్యం కాలనీలో ఉన్న దైవ కృప అనాథ ఆశ్రమానికి శుక్రవారం కిసాన్ పరివార్ సంస్థ ఆధ్వర్యంలో 50క్వింటాళ్ల బియ్యం అంద చేశారు. ఆశ్రమంలో ఉన్న విద్యార్థుల కోసం తమ వంతు సాయం అందించామని కిసాన్ పరివార్ సంస్థ వ్యవస్థాపకుడు వివేక్ తెలిపారు. అనంతరం ఆశ్రమ విద్యార్థులతో కలిసి మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అన్ని వేళలా అండగా ఉండామని అన్నారు. కార్యక్రమంలో హరినాయక్, విష్ణు, వెంకన్న, శివ పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి

జిల్లా సెషన్ కోర్టు జడ్జి సీ సురేశ్

కురవి, జనవరి 24 : మహిళలు అన్నిరంగాల్లో ముందున్నప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని మహబూబాబాద్ జిల్లా సెషన్ కోర్టు జడ్జి సీ సురేశ్ అన్నారు. కురవి మండలం నేరడ మోడల్ పాఠశాల, కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా సెషన్ కోర్టు జడ్జి సురేశ్ హాజరయ్యారు. పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. అనంతరం సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మహిళలు లేనిదే ప్రపంచమే లేదన్నారు. బాలికలు విద్య, ఆరోగ్యం సామాజిక అంశాల్లో అభ్యున్నతి దిశగా పయనించాలన్నారు. భ్రూణహత్యల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో మహబూబాబాద్ విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్, స్థానిక ఎస్సై సతీశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశానికి పిలిచి అగౌరవ పరచడం సరికాదు

ఎమ్మెల్యే మురళీనాయక్


సమావేశంలో చైర్మన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్, జనవరి 24 : మహబూబాబాద్ నియోజకవర్గం పార్టీ నాయకులను, వార్డు కౌన్సిలర్లను, డైరెక్టర్లను వ్యవసాయ మార్కెట్ కమిటీలో గౌరవించటం లేదని, సమావేశానికి పిలిచి వార్డు కౌన్సిలర్లను, డైరెక్టర్లను స్టేజీపైకి పిలవకపోవటంతో అలిగిపోయారని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్‌పై ఎమ్మెల్యే మురళీనాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం వ్యవసాయ మార్కెట్లో నూతన మిర్చి కొనుగోలు కేంద్రం, సద్దిమూట భోజన శాలను ప్రారంభించేందుకు ఎమ్మెల్యేలు రామచంద్రునాయక్, మురళీనాయక్‌లను ఆహ్వానించారు. సరైన సమయానికి డోర్నకల్ ఎమ్మెల్యే హాజరయ్యారు. మానుకోట ఎమ్మెల్యే రావటం ఆలస్యం కావటంతో రామచంద్రు నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ కలిసి మిర్చి కొనుగోలు కేంద్రం, సద్దిమూట భోజన శాలను ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో కౌన్సిలర్లు, మార్కెట్ డైరెక్టర్లను స్టేజ్ మీదకు పిలక పోవటంతో అక్కడి నుంచి వెళ్లిపోయి ఎమ్మెల్యే మురళీనాయక్‌కు సమాచారం అందించారు. అనంతరం సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మురళీనాయక్ చైర్మన్‌పై, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సర్ది చెప్పటంతో సమావేశం కొనసాగించారు.